

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

**– పవని నిర్మల ప్రభావతి**

పద్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**మంత్రాలు** పుస్తకాలలో వుంటాయి.

కానీ నిజంగా సాధన చేసి, సాధించిన గురువు ద్వారా ఉపదేశించబడిన సాధారణ అక్షరమైనా సరే. మంత్రం అవుతుంది నాయనా! మంత్ర పునశ్చరణతో, నిరంతర కఠోర సాధనతో, మంత్రాదినేతను క్షుద్ర కోరికలకు గాక నిజమైన మోక్షప్రాప్తికై సాక్షాత్కరింప చేసుకున్న గురువు ద్వారా ఉపదేశింపబడిన మంత్రం శిష్యుడ్ని ఉద్ధరిస్తుంది. అంతే.

రామానుజాచార్యులు విశాల హృదయంతో తాను ఎన్నో కష్టనష్టాలకు లోనై పొందిన అష్టాక్షరి (తిరు) మంత్రాన్ని సర్వ మతస్తులకు, సర్వ కులస్తులకూ, సర్వ మానవులకూ సుగమం చేసారు. ఆలయ గుడి గోపురం మీద నిల్చుని బోధించారు.

అయితే అది అందుకున్న వారెందరన్నది ప్రశ్న.

ఇలా సాగిపోతుంటుంది శేషాచారి సంభాషణ. రామచంద్రం శ్రద్ధ నిండిన శ్రోత. ఇద్దరూ ఆలయ మంటపంలో గంటల తరబడి కూర్చుంటారు. ధనుస్మాసపు చలిలో... రామచంద్రానికీ మొదట్లో అర్థమయ్యేది కాదు. రాను రాను ఆయనగారి మాటలు బోధపడుతున్నాయి.

శేషాచారి భార్య అనసూయమ్మ. ఒకే కూతురు సీత. ఒకే కొడుకు శ్రీనివాసాచారి. శేషాచారి తమ్ముడు రంగనాధాచారి. తహశిల్దారుగా పని చేస్తుండేవాడు. ఆయన భార్య పద్మావతి. వాళ్లకి ఒక్కర్తె కూతురు, ఊర్మిళ.

శేషాచారి వృతి– వ్యావృత్తి పరానికి సంబంధించినవి. ఆయనగారందులో ఆత్మానందాన్ని, ఆత్మ సంతృప్తిని పొందేవారు. రంగనాధాచారి వృత్తి లౌకికమైనది. అయితే భుక్తి కోసం ఏ వృత్తి అయినా ఫర్వాలేదు. కానీ అతగాడి స్వభావమూ పరమ లౌకిక మైనది. ఆయనకు తగిన భార్య పద్మావతి.

ఉద్యోగం తాశిల్దారు అయినా రంగనాధం ఇల్లు జమిందారు ఇల్లులా వుండేది.

అసలు జీతం కంటే పై సంపాదనా, పటాటోపం జాస్తి. రెవెన్యూ ఇన్స్పెక్టర్లు మొదలు, గ్రామధికార్ల వరకూ రంగనాధం చేతి వాటానికి నిర్ఘాంత పోయేవారు. వారిలో చాలా మందికి రంగనాధంలా తామూ బాగుపడి పోవాలన్న కాంక్ష కూడా మొదలయింది. తమ్ముడి చేయి వాటం శేషాచారి చెవి దాకా వచ్చింది. దగ్గరి ఆత్మీయులు, “నీ తమ్ముడి గురించి చాలా చెడుగా చెప్పుకుంటున్నారు” అని శేషాచారి గారితో అన్నప్పుడు శేషాచారి హృదయం ఆవేదనతో తల్లడిల్లి పోయేది.

అతి నిష్ఠాగరిష్టులైన తల్లి దండ్రులకు తామిద్దరూ జన్మించారు! శ్రీరంగశాయి అర్చనలో తరతరాలు పునీతమయి పోయిన వంశం తమది. కానీ తామిద్దరి స్వభావాలలో ఈ తేడా ఎలా? ఎందుకు వచ్చింది?

ఇదే దైవ లీలా, కర్మ పరిపాకమా? ఏమో?

‘తమ్ముడూ రంగనాధం! ఎందుకిలా ఆరాటపడతావు? ఉద్యోగరీత్యా, నీకు నీ కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం వస్తోంది. హోదా వుంది. నిజమయిన గ్రామీణ సమస్యలేవో ఆలోచించు. అవి తీర్చు. నీ క్రింది ఉద్యోగులలో నీ నిజాయితీ పట్ల భయమూ, ఆరాధనా ఉండేలా చేసుకో. మనిషి పుట్టి పెరిగి, మరణించే లోగా గడిపే జీవితంలో ఆ మనిషి ఏం తిన్నాడనీ, ఏ పట్టు పీతాంబరాలు కట్టుకున్నాడనీ, ఏ నగలు ధరించాడనీ అన్న ప్రశ్న ముఖ్యమైంది కాదు. దాని జవాబూ చిరంజీవత్వం ఇవ్వదా వ్యక్తికి,

అతగాడేమి మేలు చేశాడు? ఇతరులకి ఎన్ని జీవితాలకు చేయూత యిచ్చాడు? ఎందర్ని ఉద్ధరించాడు? తనకు మానవ జన్మ నిచ్చిన భగవంతునికి ఏ విధంగా కృతజ్ఞత తెలుపుకుని తన ఋణం కొంతయినా తీర్చుకున్నాడు అన్నవే నిజమైన ప్రశ్నలు. వీటి జవాబులే అతగాడి ఉనికినీ, మనికినీ చిరంజీవిగా నిలుపుతాయి. నీకున్నది ఒక్క ఊర్మిళ. దానికే కొరతా లేదు. నా మాట విను" అలా సాగిపోయే శేషాచారిగారి హితబోధంటే రంగనాధానికి తగని చిరాకు.

సుఖపడటమూ, భోగప్రదమైన జీవితాన్ని అనుభవించటమూ చేతగాని వారంతా యిలాగే మాట్లాడుతారని అతగాడి అభిప్రాయం.

ముఖ్యంగా శేషాచారిలాటి వారు దైవం దైవం అంటూ వో విధమయిన 'ఎస్కేపిజం' లోనూ, 'అంతా దేవుడి లీల' అంటూ దేవుడి మీద నెపం వేయటంలోనూ జీవితాలని గడిపి వేస్తారని చులకన.

"అన్నయ్యా! నీ మార్గం నీది. నా మార్గం నాది. నీ ఉద్దేశ్యం ప్రకారమే జరిగివుంటే నేనూ తిరుచూర్ణం నామాలు దిద్దుకుని, పట్టుబట్ట కట్టుకుని నల్లని రాయిలో శిల్పాన్ని గాక, "దివ్యదృష్టులనూ, దయావృష్టులనూ, దివ్య మంగళ రూపాలనూ"(ఇది నాకు అర్ధమూ కాదు. అనుభూతికీ రాదు) చూస్తూ అభిషేకాలూ తిరుమంజనాలు చేస్తూ వుండి పోవలసి వచ్చేది. నాన్నగారినీ, నిన్నూ ఎదిరించి ఎలాగో చదివాను. ఆచారత్వం నుండీ, పూజారి ప్రమాదం నుండీ నన్ను నేను రక్షించు కున్నాను. నన్ను ఇబ్బంది పెట్టకు" అనేవాడు.

శేషాచారి భార్య అనసూయమ్మకూ, కూతురు సీతకూ, కొడుకు శ్రీనివాసాచారికీ రంగనాధం, పద్మావతిలు ఆరాధ్యదైవాలు. అలా శేషాచారిగారు వుండటం లేదనీ, తమకి అలాటి జీవితం ఆయనగారివ్వలేదన్న అక్కసూ వుంది. కనీసం పూజార్లలో ఎక్కువమంది, దేవుణ్ణీ, దేవుడి భయాన్నీ అడ్డు పెట్టుకుని భక్తులను నిలువుదోపిడీ చేసి దేవుడి కళ్ళు కూడా కప్పే లౌక్యం వున్నట్లుగానైనా శేషాచారిగారు ఉండరనీ.

"ఆ దేవాలయంలో రాతి విగ్రహంలో మలచబడిన కళ్ళు గురించి నాకు భయం లేదర్రా! నిరంతరం తెరుచుకుని వుండే మన మనోనేత్రాలకి మాత్రమే నేను భయపడతాను. అవి మూయించలేను. అవి మూయిస్తే ఇక ప్రపంచపు వెలుగే వ్యక్తికి గోచరించదర్రా!" అని నవ్వేస్తారానీ వాళ్ళకు కోపం.

సీత చదువులో పైకి రాలేదు. తొమ్మిదో తరగతి వరకూ ఎలాగో గెంటించి, అక్కడే చతికిలబడి పోయింది. ఆసరికి ఆ అమ్మాయిలో తాను తెల్లగా, చక్కగా, పోతపోసిన దేవీ విగ్రహంలా ఉంటానన్న ఆహమూ, తన అతి అందం పట్ల తల్లి, తల్లి వేపు బంధువులు చూపే 'గొప్ప' వల్ల అతిశయమూ మాత్రం వచ్చేశాయి.

గంటల తరబడి ఏదో పిచ్చి నవలలు చదవటం, అద్దం ముందు కూర్చుని అలంకరించుకోవటం, తన అందానికి తానే మురిసి పోవటం ఆమె హాబీలుగా మారాయి.

శ్రీనివాసాచారికీ చదువంటడం లేదు. తండ్రి వృత్తి అన్నా, మాట అన్నా హేళన.

చిన్నాన్న రంగనాధం పట్ల అపరిమితమైన ఆరాధన ఏర్పడింది. తరచూ చిన్నాన్న వెంట కాంపులకు వెళ్ళటం, 'తాశిల్దారుగారి అబ్బాయి' గా గ్రామాదికార్ల మీదా, వెట్టి ముదాముల మీదా పెత్తనం చెలాయించటంలో ఎక్కువ ఆనందం పొందుతున్నాడు.

"నా బాబు కలెక్టరవుతాడు. మీరు వాడికి 'పంగనామాలు' పట్టించి పాడు చేయకండి." శేషాచారిగారిని అలా అనే అనసూయమ్మ మాటలతో వాడు పేరుకు చదువుతున్నాడే తప్ప, వాడికి చదువు మీద శ్రద్ధగానీ, భవిష్యత్తు పట్ల భయం గానీ లేకుండా పోయాయి. అదీగాక తల్లి అనసూయమ్మకు మరో ఆశ వుంది,

ఊర్మిళను ప్రసవించే టైంలో పద్మావతికి ప్రసవం సరిగా జరగక పెద్ద ఆపరేషన్ చేయవలసి వచ్చిది. ఆ ఒక్క కాన్పుతోనే మరి పిల్లలు కలగటానికి వీలు లేకుండా ఆపరేషను చేయవలసి వచ్చింది.

ఎలాగూ రంగనాధానికి మగపిల్లలు గానీ, మరే పిల్లలు గానీ కలిగే అవకాశమే లేదు. అతగాడు ప్రపంచంలోని డబ్బూ, వస్తు సముదాయమూ అంతా తానొక్కడే స్వంతం చేసుకోగలిగితే చాలన్నంత 'ఆబ'గా సంపాయిస్తున్నాడు.

ఊర్మిళ ఒక్క కుమార్తెకు యెంత యెక్కువగా కట్నము నగలు యిచ్చి పెళ్లి చేసి పంపించినా, తరగని సంపద ఆస్తి రూపంలో, నగల రూపంలో ఉండనే వుంటుంది. అంత ఆస్తిని పరాయివాడయిన అల్లుడికి ధారపోయడెలాగూ! పైగా తన తదనంతరం తన వారసుడు తనకు పితృకర్మలు నిర్వర్తించడానికి అర్హుడు అవుతాడు గానీ దౌహిత్రుడు కాబోడు, విధి లేకపోతే తప్ప.

రంగనాధానికి శ్రీనివాసం అంటే చిన్నప్పటి నుంచీ ముద్దు వుంది, ఎక్కువగా దగ్గరకు తీస్తూ వెంట పిలుచుకు వెళుతూ, ఎక్కువ భాగం చదువుకీ, బట్టలకీ పై ఖర్చులకీ యిస్తూ గారం చేస్తుంటాడు.

"నా వారసుడివీ, నాకు కొరివి పెట్టాల్సిన వాడివీ, నా అన్న కొడుకువైనా, కన్నకొడుకువైనా నువేరా శీనూ!" అంటుంటాడు తరచూ.

కాబట్టి ఊర్మిళకు పెళ్ళయిపోయాక, అల్లుడు ఏడ్చి పోకుండా ఏదో కాస్తంత ముట్ట చెప్పి, విగతా ఆస్తంతా శ్రీనివాసానికే యిస్తాడేమో రంగనాధం  తన కొడుకు చదివినా మానినా, ఉద్యోగం చేసినా చేయకున్నా, జమీందారులా బ్రతుకుతాడు! కాలి మీద కాలు వేసుక్కూర్చుని తీరిక్కూర్చుని తిన్నా, మూడు తరాలకి తరగని ఆస్తి వుంటుంది.

ఈ పిచ్చి పూజారి పనీ, మళ్ళూ  తళ్లూ, ఆచారాలూ అభిషేకాలూ, ధనుర్మాసాలూ చాతుర్మాసాలూ, ముద్రాంకితాలు ఎందుకట? అసలు రంగనాధం సీతకు కూడా గొప్ప సంబంధం... ఏ డాక్టరో ఇంజనీరో అయిన కురాడ్ని చూచి చేయాలంటున్నాడు. బహుశా ఖర్చు కూడా కొంత తనే పెట్టుకుంటాడు.

ఇలా సాగుతున్నాయి అనసూయమ్మ ఆలోచనలు. ఎప్పుడేనా శేషాచారిగారితో తన ఆలోచనల ఛాయలు చూచాయగా వెల్లడిస్తుంది ఆమె.

శేషాచారి గారు నవ్వుతారు. "అనసూయా! కాస్త లోతుగా ఆలోచించు. నీ శరీరమే నీది కాదు. నీలో నుంచి ఆ చైతన్య జ్యోతి మాయమైన మరుక్షణం నీ శరీరం చైతన్యరాహిత్య స్థితిని పొందుతుంది. ఐహికమైన సర్వకర్మల నుంచి అది విముక్తి పొందుతుంది. ఆ సమయంలో నీ దేహం కట్టెలలో ఓ కట్టే. మట్టిలో ఓ భాగం. క్షణాలలో శిధిలమై పోతుంది.

మనకు అత్యంత ప్రియమైన దేహమే మనది కానప్పుడు ఇతరుల ఆస్తులూ, డబ్బూ మనకి వస్తాయనీ, మనకి రావాలనీ, చెందాలనీ అనుకోవటం ఆశపడటం ఎంత భ్రమో ఆలోచించు" అనేస్తారాయన.

అనసూయమ్మకు చెడ్డ కోపం వస్తుందా మాటలతో. "నా శ్రీనివాసుల భవిష్యత్తు కోసం నా ఆశంతా! నా కోసం కాదు."

అలా అన్నప్పుడు శేషాచారి గారు జాలిపడ్తారు.

"శ్రీనివాసం కోసమా నీ ఆరాటం? అసలీ శ్రీనివాసులెవరు?"

ఒక్కసారిగా ఆమె కంపించి పోతుంది.

అవును శ్రీనివాసులెవరు?

సీత పుట్టాక ఏడెనిమిది సంవత్సరాల తర్వాత వచ్చిన గర్భం. "ఈసారి ఏ బిడ్డ అయినా పుట్టనీ. ఇక మనకు పిల్లలొద్దు. ధర్మార్ధ కామ మోక్షాదులనే నాలుగింటిలో మూడింటిని పూర్తి చేసుకున్నాను నేను. మోక్షసాధనకు

గృహస్తాశ్రమానికి మించిన సాధనం లేదన్న మా గురుబోధ ప్రకారం గృహస్థ ధర్మాన్ని క్షుణ్ణంగా ఆచరించాను. ఇక మోక్ష సాధనకు మెట్టుగా మనం బ్రహ్మచర్యం అవలంబిద్దాం" అని భర్త నిర్ణయం చేశాడు.

తన పుట్టినింటివారిదీ యిలాటి నిష్టాపూరిత సంసారమే కాబట్టి తనూ సరేనంది.

ఎనిమిదవ నెల జరుగుతోంది. హఠాత్తుగా ఆ రాత్రి కాళరాత్రిలా పెనుతుఫాను ముంచుకు వస్తోంది. నొప్పులు ప్రారంభమైనాయి. ఇంట్లో ఎవరూ లేరు. శేషాచారి బయటకు తల పెట్టే వీలు కనిపించలేదు. ఎవరికీ కబురు తెలిపే అవకాశం లేదు. ఎవరినీ సాయానికి పిలిచే వీలూ లేదు. పెన్నా గట్టు ఒరిసి పారుతోంది.

తెల్లారుఝామున ఆమె ప్రసవించింది మగ శిశువుని. మగశిశువు కానీ మృతశిశువు.

ఉషోదయాత్పూర్వం... ప్రకృతి భీభత్సం  కాస్తంత సద్దు మణిగిన సమయంలో పినాకిని ఉధృతాన్ని చూచేందుకు, మృతశిశువును పారవేసి...

"ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి శ్రీరంగసాయీ! బ్రహ్మచర్య దీక్ష విరమించి మరలా మరో బిడ్డ కోసం సంసార మాయలో చిక్కుకోనా? అనసూయకు మగబిడ్డల్లేరన్న కొరత అలాగే వుంచనా?" అనుకుంటూ ఆలోచిస్తూ నడుస్తున్న శేషాచారి కళ్ళకు శ్రీరంగనాయకుని ఆలయం వెనుక భాగంలో పెన్నా హోరున పారుతున్న శబ్ధంలో పసిబిడ్డ ఏడుపు వినిపించింది.

భ్రమేనేమోనన్న ఆలోచనతోనే అడుగు వేశాడు.

నెల నిండని మగశిశువు..

బహుశా ఎవరో కని పారేసి ఉండవచ్చు. ఏ కులమో ఏ మతమో? తలిదండ్రులెవరో? నీటిలో కొట్టుకు వచ్చి, గట్టుకు విసరి వేయబడిన మొండి ప్రాణియా, లేక ఉప్పెనలో కొట్టుకుపోతూ మాతృ మమతతో గుండెలకు హత్తుకున్న శిశువు తల్లిని ప్రవాహానికి అప్పగించి, తల్లి నుండి విడివడి... ఇలా స్వామి పాదాల మీద నిలిచి పోయాడా 'భవిష్యత్తు నిర్ణయించ' మంటూ.

తను ఈ శిశువును పెంచుకుంటే? అనసూయకిస్తే ఆమె పాలిచ్చి పెంచుతుందా? తన బిడ్డగా స్వీకరిస్తుందా?

నిప్పును కడిగే తన ఆచారం మాటేమిటి? కులమూ మతమూ తెలీని బిడ్డను తన బిడ్డగా అనుభూతి చెందగలడా?

లిప్తపాటే ఈ ఆలోచనలన్నీ.

"జన్మనా జాయతే శూద్రః

కర్మణా జాయతే ద్విజః

వేద పాఠేన విప్రత్వం

బ్రహ్మ జ్ఞానంతు బ్రాహ్మణః

హృదయంతరాళాలలో నుంచి ఏదో దివ్యవాణి ప్రభోధం! భూనభోంతరాళాలు నిండిన మధుర గంభీరనాదం అది. సర్వ ఉత్కృష్ట నికృష్ట జన్మలనూ ఆ బ్రహ్మ కీట పర్యంతం సర్వ చరచరాలనూ, సర్వ చైతన్యా చైతన్యాలనూ సమదృష్టితో వీక్షించే సర్వాంతర్యామి దివ్య సందేశం ఎదకు చల్లగా తగిలింది శిశువు రూపంలో!

మగబిడ్డ... చేతులు జోడించాడు సర్వాంతర్యామికి. చేతులలోకి తీసుకున్నాడు. ప్రతి మనిషీ తల్లి గర్భంలో నుంచి బయట పడినపుడు చీము, నెత్తురుల ముద్దగా మనసూ, మెదడూ పనిచేయకుండా కేవలం శ్వాసకోశాలు పని చేస్తున్నందుకు గుర్తుగా ఏడుస్తూ ధ్వని కలిగిస్తూ నిద్రా, జాగృతి కాని ఒకానొక చైతన్య రాహిత్య స్థితిలో తామసత్వములో వుండి పోతాడు. దానినే శూద్రత్వం అనే మాట చెప్పారేమో. తామసత్వానికి మరో పేరే శూద్రత్వం.

ఉపనయనాది కర్మలతోనో లేక గురు బోధలాటి అత్యున్నత మేల్కొల్పు ద్వారానో ఆ నిద్రాముద్రితమైన ఆత్మ జాగృతం చేయబడి, ఆ వ్యక్తి రెండవ జన్మనూ, పునర్జన్మనూ పొందుతాడు. అవే వివిధ మతస్తులకూ వివిధ రూపాలలో వుంటుంది.

ఇక తను పొందినది నిర్మలంగా పాటించి ఆచరించిన వ్యక్తి ఎవరైనాగానీ ఉన్నతుడూ, ఉత్తముడూ అయి తీరుతాడు.

చివరగా ఆత్మ సాక్షాత్కారాన్ని పొందినవాడే నిజమైన అగ్రకులస్తుడు.

మరలా విపులీకరిస్తే ఈ కనిపించే ప్రపంచంలో ఎందరు నిజమైన బ్రాహ్మణత్వానికి అర్హులు?

ఓ భక్త నందనారు, ఓ భక్త రామదాసు, ఓ కబీరు, ఓ యేసుక్రీస్తు, ఓ రామానుజుడు, ఓ రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి మొదలయిన కులమతాతీతులైన అత్యున్నత మానవతకూ, దైవత్వానికీ వారధులైనవారు, బ్రాహ్మణత్వానికి అర్హులైనవారు.

ఇల్లు వచ్చేసింది.

గుండె ఝల్లుమంది శేషాచారికి. ఈ నడచినంత దూరమూ పిట్ట పురుగు కనిపించలేదు. ప్రకృతి ప్రళయ ఘోషలో తనింట్లో ఓ మృతశిశువు జన్మించటమూ, మరో అనాథ శిశువు దొరకటమూ ఎవరికీ తెలియని, ఎవరూ గమనించని విచిత్ర వాతావరణం ఇది!

శ్రీకృష్ణుని చెరసాల నుంచి రేపల్లె చేర్చే వరకూ వసుదేవునికి ఏ అడ్డంకులూ రాలేదా? యమునానది నిజంగా దారి యిచ్చిందా?

మత్స్యగంధీ, పరాశరులకు ఓ జాతి జాతికీ స్మృతి శృతి పురాణాలు అందించవలసిన మహానుభావుడైన వ్యాస మహర్షి జన్మించవలసిన సమయంలో నదీ మధ్యలోని పడవ కనిపించకుండా మబ్బులు నిజంగా కమ్ముకున్నాయా?

ద్రౌపది మాన సంరక్షణ కోసం నిజంగా ఆమె కేకతో భగవంతుడు పలికి వస్త్రదానం చేశాడా?

అలాటివి యెన్నో శంకలు...

అవి తరాలు తర్కించే వారి సంస్కారాన్ని బట్టి చెలరేగే ప్రశ్నలు.

కానీ ఈ జరుగుతున్నదీ, జరిగినదీ వో మహాద్భుత లీలలోని భాగం, తర్కాతీత సత్యం.

“ఏమిటది?”

అనసూయ కంఠ స్వరంతో త్రుళ్ళిపడ్డాడు. మృత శిశువు కోసం దుఃఖించిన ఆమె కళ్ళు ఉబ్బి వున్నాయి.

అనసూయ అంగీకరిస్తుందా? అప్పుడనిపించిందా ప్రశ్న.

ప్రవాహ వేగానికి తట్టుకుని బ్రతికి పెరుమాళ్ళ పాదాల మీదకు విసరి వేయబడిన ఈ బిడ్డ అనసూయ గాకుంటే మరో తల్లి ప్రేమ అందుకుని తీరాలి. అది విధి నిర్ణయం. అంతే.

“మగబిడ్డ.” చెప్పాడు.

“నాకివ్వండి. ఏడీ, ఎవరు? దొరికాడా? ఫర్వాలేదు. ఎవరికీ చెప్పొద్దు.” అనసూయ ఏవో ప్రశ్నలు వేస్తోంది, బిడ్డను హత్తుకొంటోంది.

శేషాచారి కవేం వినిపించటం లేదు.

“సర్వస్య చాహం హ్రుదిసన్ని నిష్టో
మత్తః స్మృతి జ్ఞాన మపోహనంచ

వేదైశ్చ సర్వై మేవ వేద్యో
వేదాంత కృద్వేద విదేవ చాహం!"
భవద్గీత లోని శ్లోకం గుండెల్లో మారుమ్రోగుతోంది.

అనసూయ ప్రవర్తనకీ, బిడ్డపట్ల అవ్యాజానురాగానికీ మూలం ఆ సర్వాంతర్యామి సందేశం.

గృహ పూజావిధి నిర్వర్తించటానికి జాతా శౌచం అడ్డు వస్తుందీ రోజు. మృతశౌచమూ అడ్డు వస్తోంది. ఒక శిశువు జన్మించటం– మృతించటం మరో శిశు జననం ... కాదు దొరకటం. పోనీ ఏదో ఒకటి.

కాళ్ళూ చేతులు కడుక్కుని మానసికంగా జప విధానంలో మునిగి పోయాడు శేషాచారి.

ఊర్మిళ చదువులో బాగా పైకి వస్తోంది. సీత మూడు సార్లు ఫెయిల్ కావటంతో చదువాపటం జరిగింది. ఊర్మిళ మాత్రం మెట్రిక్ పాసైంది ఫస్ట్ క్లాసులో.

ఊర్మిళని డాక్టర్ కోర్సులో చేర్పించి చదివించాలనుకున్నాడు రంగనాధం. అందుకుగాను బై.పి.సి. గ్రూప్ లో ఇంటర్ మీడియట్ లో చేరుద్దామనుకున్నారు కూడాను.

వేసవి కాలం శలవుల్లో సంపూర్ణ దక్షిణ దేశ యాత్రలు చేసి రావాలనిపించిది రంగనాధం, పద్మావతులకు.

ఊర్మిళను కూడా వెంట పిల్చుకెళదామనుకున్నారు. గానీ ఆ అమ్మాయి రానంది. పెదనాన్న వాళ్ళ దగ్గర సీతక్కతోను, తమ్ముడు శ్రీనివాసాచారితోనూ సరదాగా గడుపుతానంది.

నిజానికి ఊర్మిళకు సీతక్కతో కబుర్ల కంటే పెదనాన్నతో ఎన్నో విషయాలు మాట్లాడుతుండటం, పెదనాన్న వెంట రంగనాయక స్వామి ఆలయానికి వెళ్లి గంటల తరబడి వుండి పోవటం సరదా. ఆయన చెప్పే మాటలలో ఏదో గొప్పదనం, గొప్ప భావం, ఆర్తి, హృదయానికి చల్లదనం కలిగించే శాంతి వున్నాయని పిస్తుంది.

తండ్రి ఉద్యోగం వల్ల ప్రతి జిల్లా తిరుగుతుండటం వల్లా, ఎప్పుడో తప్ప నెల్లూరు వచ్చి పెదనాన్న దగ్గర నాలుగు రోజులుండే అవకాశం లేదా అమ్మాయికి ఎప్పుడూ. తండ్రి ఉద్యోగరీత్యా కడప, అనత పూర్, కర్నూల్... యిలా జిల్లాలు తిరుగుతున్నారు.

రంగనాధం, పద్మావతిలు కూడా ఊర్మిళను పెదనాన్న ఇంట ఉంచటమే మంచిదనుకున్నారు, ప్రయాణంలో పిల్ల అలసిపోతుందనిపించింది. వాళ్ళు యాత్రా స్పెషల్ లో టికెట్లు రిజర్వ్ చేయించుకుని వెళ్ళిపోయారు.

అనసూయమ్మ ఊర్మిళను నెత్తిన పెట్టుకుంది. కారణం ఊర్మిళకు బోలెడన్ని నగలూ, పట్టు పరికిణిలూ, ఓణీలూ వున్నాయి.

ఊర్మిళ ఎప్పుడొచ్చినా సీత కోసం రెండు మంచి పరికిణీలూ, ఓణీలూ లేదా మంచి చీరెలూ తెస్తుంది. తన దగ్గరున్న వాటిలో సీత నచ్చినవి ఏవైనా సరే ఇచ్చేస్తుంది. రంగనాధం కూతురి పై ఖర్చులకు అంటూ దండిగా డబ్బిచ్చి వెడతాడు. ఊర్మిళను పని ముట్టుకోనివ్వదు అనసూయమ్మ. ఇంకా ఆ అమ్మాయి పనల్లా పెదనాన్నతో కబుర్లూ, సీతక్క గొడవ పెడ్తుంటే సినిమాలు చూడటం.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments